క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



కాళికాంబ దేవాలయంలో హుండీ సొమ్ము లెక్కిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళి కాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం, బ్రహ్మ నందీశ్వరస్వామి దేవాలయాల హుండీ కానుకల లెక్కింపును ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కాళికాంబ దేవాలయం హుండీ నుంచి రూ.8,68,199 లభించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.18,886 ఆదాయం వచ్చిందని, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయం హుండీ నుంచి రూ.46,328 ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు నాగమణిబాయి, వరలక్ష్మి, సుబ్రహ్మణ్యం శాస్త్రి, వెంకటరమణాచారి, రాఘవేంద్రాచారి, మురళీకృష్ణశర్మ, సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్టీసీ డిపోలో జూలై మాసంలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు బుధవారం డిపో ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. డిపో మేనేజర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ డిపోకు అత్యధిక ఆదాయం తెచ్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలను అందజేశారు. కండక్టర్లు చంద్రుడు, మల్లికార్జున, శేషన్న, రాజు, డ్రైవర్లు ప్రసాద్, నాయక్, కృష్ణ, నర్సయ్యను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు, బాషా పాల్గొన్నారు.

వాహనాల వేలం



రుద్రవరం కలప డిపోలో వాహనాల వేలం వేస్తున్న అధికారులు

రుద్రవరం: స్థానిక కలప డిపోలో బుధవారం సబ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసరెడ్డి, రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేశారు. రేంజర్ తెలిపిన వివరాల మేరకు.. గత కొన్నేళ్ల నుంచి వివిధ కేసుల్లో పట్టుబడిన 11 మోటార్ సైకిళ్లను వేలం వేసినట్లు తెలిపారు. వాటిలో 3 మోటార్ సైకిళ్లను రూ.20,150లకు హెచ్చు పాడి దక్కించుకున్నట్లు చెప్పారు.

మాజీ ఎంపీటీసీ మృతి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): మండలంలోని పోలూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేరెడ్డి భాస్కరరెడ్డి(62) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని భాస్కరరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాస్కరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఏపీఓపై ఎంపీడీఓ ఆగ్రహం



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో పలువురి జాబ్‌కార్డుల తొలగింపుపై ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జాబ్ కార్డుల తొలగింపునకు గురైన బాధితులు పలువురు ఎంపీడీఓ సుగుణశ్రీకి ఫిర్యాదు చేశారు. తొలగింపునకు కారణాలను ఏపీఓ శ్రీకళారెడ్డిని వివరణ కోరగా పొంతలేని సమాధానాలు ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులు చేయకుండా పక్కవారి కొలతలు చూపించి జాబ్ కార్డులున్న వారికి ఫీల్డ్ అసిస్టెంట్లు డబ్బులు వేశారంటూ.. ఇటీవల సామాజిక తనిఖీల్లో బయట పడకుండా ఉండేందుకు జాబ్‌కార్డులు తొలగించారంటూ బాధితులు ఆరోపించారు. నిజానిజాలు బయటకు రాకపోతే ఏపీఓ, డిజిటల్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేస్తామని, రెండుమూడు రోజుల్లోగా కచ్చితమైన సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ హెచ్చరించారు.

వాచ్‌మెన్లను నియమించాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాచ్‌మెన్లను నియమించాలి. కొన్ని చోట్ల ఆసుపత్రులు గ్రామ శివారులో ఉన్నాయి. ప్రజల రాకపోకలు లేని ప్రాంతాల్లో, పొలాల దగ్గర ఉన్న పీహెచ్‌సీల్లో రాత్రి, పగలు డ్యూటీల ప్రకారం వైద్య సేవలు అందిస్తున్నాం. అలాంటి చోట రాత్రి సమయాల్లో ఒంటరిగా ఉంటూ విధులు నిర్వహించాలంటే భయంగా ఉంటోంది. వైద్య సిబ్బంది రక్షణకు వాచ్‌మెన్లను నియమిస్తే ధైర్యంగా ఉంటుంది.

– రుతురాణి, స్టాఫ్ నర్సు, నర్సాపురం పీహెచ్‌సీ



కొత్త చట్టాలు తేవాలి



ఆగస్టు 9వ తేదీన కోలకతాలోని ఆర్‌జీకార్ ఆస్పత్రిలో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటన జరగడం బాధాకరం. ఒక మహిళా వైద్యురాలికి ఆస్పత్రుల్లో భద్రత కరువయ్యిందంటే చాలా విచారకరమైన విషయం. మహిళా వైద్యురాళ్లకు ఆస్పత్రుల్లో భద్రత కల్పించి మనోధైర్యం ఇవ్వాలి. కొత్త చట్టాలను చేయాలి. ఆస్పత్రుల్లో సెక్యూరిటీని పెంచాలి. ఇలాంటివి పునరావృత్తంగాకుండా చర్యలు తీసుకోవాలి. సమాజంలో మార్పుకై ప్రతిఒక్కరూ పాటుపడాలి.

– రత్నమ్మ, కొట్టాల చెరువు ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్

అసాంఘిక చర్యలపై నిఘా



మాట్లాడుతున్న రాయలసీమ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

చాగలమర్రి: రాయలసీమ రేంజ్ జిల్లాల పరిధిలో మట్కా, జూదం, గంజాయి అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు వ్యవస్థ ప్రత్యేక నిఘా చేపట్టిందని రాయలసీమ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్, నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా బుధవారం నంద్యాల జిల్లాలోని డోన్, బనగానపల్లె, చాగలమర్రి పోలీసుస్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చాగలమర్రి పోలీసుస్టేషన్‌లో 24 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 10 సిబ్బంది మాత్రమే ఉన్నారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడతామన్నారు. పోలీసుస్టేషన్ భవనం శిథిలావస్తకు చేరుకుందని, పాత భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని, అలాగే గ్రామ నడిబోడ్డున పోలీసు గృహ సముదాయం శిథిలావస్తకు చేరిందని డీఐజీ దృష్టికి తీసుకెళ్లగా.. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత జిల్లా ఎస్పీలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం పోలీసు సిబ్బంది కొరతను తీర్చేందుకు త్వరలోనే రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాల ప్రాతిపదికన ఎంపిక చేసి జోన్ల వారిగా నియామకాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ కలిసి పనిచేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. చాగలమర్రికి జాతీయ రహదారి ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నివారణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పాత నేరస్తులను గుర్తించి బైండోవర్ చేయలన్నారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, స్థానిక ఎస్ఐ రమేష్‌రెడ్డి, సిరివెళ్ల ఎస్ఐ హరిప్రసాద్, ఏఎస్ఐ అబ్దుల్‌నబీ తదితరులు ఉన్నారు.

శివా.. మాపై కరుణించవా?



శివలింగానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

చాగలమర్రి: మారుతున్న కాలాన్ని బట్టి వర్ష రుతువులో కూడా వర్షాలు కురవకపోవడంతో వరుణ యాగం చేపట్టినట్లు ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అదవేని రవికుమార్, ఉపాధ్యక్షుడు సల్లా నాగరాజు తెలిపారు. గ్రామంలో రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు దిగాలు పడిపోయి »శివా..మాపై కరుణించవా?« అంటూ బుధవారం చాగలమర్రిలోని బుగ్గరామేశ్వరాలయంలో స్వామిని వేడుకున్నారు. వరుణదేవుడి కటాక్షం కోసం శివుడికి 101 బిందెలతో నీరు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, వరుణ యాగం చేపట్టారు. ప్రధాన అర్చకులు కైప పెద్ద నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి గర్భగుడికి వరి చెక్కులు వేసి 101 బిందెలతో శివలింగంపై నీరు పోసి వరుణ యాగం చేపట్టారు. గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి స్వస్తి వాచనం, మాతృకాపూజ, ఆచారమృత్తిక వరుణం, దీక్షాధారణ, నవగ్రహ కలశ స్థాపన, బుగ్గమల్లేశ్వరస్వామి వారికి ఘట్టాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నవగ్రహ, గణపతి, వరుణ హోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం, పార్వతీ అమ్మవారికి మహిళా భక్తుల ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. అన్నదానంతో కార్యక్రమం ముగిసింది. ఏడీఏ మోహన్‌రెడ్డి, ఏఓ రంగనేతాజి, విశ్రాంత ఏడీఏ యోగిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, బ్రహ్మయ్య, నాగేంద్ర, సుబ్బారెడ్డి, బాబు, రాజశేఖర్‌రెడ్డి, గోపాలకృష్ణ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని రైతునగర్‌లోనున్న 22వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో మళ్లీ వచ్చి పరిశీలిస్తానన్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తూ చేస్తున్న పనులపై ఆరా తీశారు. సచివాలయాల ద్వారా దరఖాస్తు చేస్తున్న ప్రతి ఒక్క సర్వీసును నిర్ణీత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని, కార్యాలయంలోని కంప్యూటర్లు, బల్లలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

పీఎం జన్మన్ పథకంపై అవగాహన



హరినగరంలో గూడెం వాసులతో సమావేశమైన అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం, చిన్నయ్యస్వామి చెంచు గూడెం వాసులకు వివిధ శాఖల అధికారులు పీఎం జన్మన్ (ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్) పథకంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, తదితరులు బుధవారం ఆయా గూడెం వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పీఎం జన్మన్ పథకం కింద ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి, ఉచిత విద్యుత్, రోడ్లు, అందరికీ ఆరోగ్యం, జీవనోపాధి మెరుగుపరచడం, ఉచిత వంట గ్యాస్ ఆయుష్మాన్ భారత్, అందరికీ ఆధార్, రేషన్ కార్డులు తదితర పథకాలపై అవగాహన కల్పించి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది తదితరులు ఉన్నారు.

గిరిజనుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్‌డీ తాహిర్ హుసేన్

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచుగూడెం, చాగలమర్రి కేజీబీవీలోని బుధవారం ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ రవికుమార్, ఈఓపీఆర్‌డీ తాహిర్ హుసేన్ పరిశీలించారు. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (జన్మన్) పథకం అమ లులో భాగంగా డి.వనిపెంట గ్రామ పరిధిలోని చెంచుగూడెంలో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. మిషన్ జన్మన్ ద్వారా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని తద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే స్థానిక కేజీబీవీని పరిశీలించి విద్యార్థినులకు కావలసిన మౌలిక సదుపాయాలపై ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో భద్రత కరువైందని, అలాగే కళాశాల పనులు పూర్తి కాకపోవడంతో ఇంటర్ విద్యార్థినులకు కూడా విద్యాలయం గదులలోనే తరుగతులు నిర్వహిస్తున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మహబూబ్‌దౌలా తెలిపారు. సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, సిబ్బంది రజీకుమార్, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరుకు చెందిన నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాదు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఆలమూరు గ్రామ శివారులోని మొక్కజొన్న పొలంలో అందర్ బాహర్ పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో నలుగురు పట్టుబడ్డారని, మరో ఐదుగురు పరారైనట్లు చెప్పారు. కేసు నమోదు చేసి పట్టుబడ్డ వారి నుంచి రు.41,240 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 8 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు, సమస్యల కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రయాణికుల సమస్యలు, సలహాలకు సెల్: 9959225800 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళా ఉద్యోగుల రక్షణకు కమిటీలు

శిరివెళ్ల: ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో మహిళా ఉద్యోగుల రక్షణకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సువర్ణలత అన్నారు. బుధవారం కమిటీల ఏర్పాటుపై మండల స్థాయి అధికారులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ.. కార్యాలయాలు, పాఠశాలల్లో పురుషుల నుంచి దాడులు, వేధింపులు తలెత్తకుండా కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. 50 శాతం, మహిళలు, 50 శాతం పురుషులతో కమిటీ ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. మండల కమిటీలో తాను చైర్మన్‌గా, మెంబర్లుగా అడ్వకేట్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉంటారన్నారు.

శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



జేసీకి వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

నంద్యాల(అర్బన్): బీసీ–ఈ కిందికి వచ్చే ముస్లింలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ముస్లిం జేఏసీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ గన్నికరీం కోరారు. ముస్లిం మైనార్టీలకు ఇప్పటికే రెవెన్యూ శాఖ ద్వారా ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యాన్ని నివారించాలని కోరుతూ బుధవారం జేఏసీ నాయకులు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం గన్నికరీం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ–ఈ లకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. పత్రాల మంజూరు లేకపోవడంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి త్వరితగతిన కులధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. జేఏసీ కో కన్వీనర్ షేక్‌మహబూబ్‌బాషా ఉన్నారు.

ఆరోపణలు కాదు.. అభివృద్ధి చేసి చూపించండి



మాట్లాడుతున్న భూమా కిషోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: అధికారపార్టీలో ఎమ్మెల్యే అయిఉండి ప్రతిపక్షాలపై తప్పుడు ఆరోపణలు చేయడం కాదు చేతనైతే అభివృద్ధి చేసి చూపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆళ్లగడ్డలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. అయితే ఆళ్లగడ్డలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడంలేదని ఎమ్మెల్యే అఖిలప్రియ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో చిన్న పిల్లాడిని అడిగినా ఏం జరుగుతుందో తెలుస్తుందని యద్దేవా చేశారు. ఇసుక ట్రాక్టర్లకు ఎంత వసూలు చేస్తున్నారో, చికెన్ సెంటర్ల దగ్గర ఎంత వసూలు చేస్తున్నారో మీ వాళ్లే కథలు కథలుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2 వేలు అఖిలమ్మ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చేతనైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి మంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(అర్బన్): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట బుధవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నంద్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బెనర్జీ మాదిగ పాల్గొని వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. సమితి నాయకులు అబ్దుల్‌రవూఫ్, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

ఆ బాధ్యతల నుంచి తప్పించాలి

నంద్యాల(న్యూటౌన్): మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఐజయ్య ఆధ్వర్యంలో స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వర్క్ అడ్జెస్టమెంట్‌లో మండల స్థాయిలో వచ్చిన గ్రీవెన్స్‌లన్నింటినీ పరిష్కరించి డివిజన్‌స్థాయి పని సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, అరవింద్, జాన్సన్, బాలస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూల్లో 25 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెటిరో ల్యాబ్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 25 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. కళాశాల స్కిల్ కో ఆర్డినేటర్ పార్వతి మాట్లాడుతూ ఎంపికై న నిరుద్యోగులు ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 80 మంది ఇంటర్వ్యూల్లో పాల్గొనగా 25 మందికి ఉద్యోగాలు కల్పించి నియామక పత్రాలు అందజేశామని చెప్పారు. కంపెనీ ప్రతినిధి విజయ్‌కుమార్, సిబ్బంది సుబ్బన్న, మస్తాన్ పాల్గొన్నారు.

నంద్యాలలో భారీ వర్షం

నంద్యాల(అర్బన్): పట్టణం, పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో మురుగు కాల్వల నీరు రహదారుల వెంట ప్రవహించడంతో బాటసారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

చాగలమర్రి: భార్య కాపురానికి లేదని స్థానిక బుగ్గరస్తా వీధికి చెందిన మహబూబ్ షరీఫ్ బుధవారం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లారీ మెకానిక్‌గా చేస్తున్న మహబుబ్ షరీఫ్‌కు వైఎస్సార్ జిల్లా నందలూరుకు చెందిన నసీమూన్‌తో 12ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. అయితే భార్యభర్తల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో రెండేళ్ల క్రితం నసీమూన్ పిల్లలతో కలిసి నందలూరులో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. పలుమార్లు పంచాయితీ చేసినా ఆమె కాపురానికి రాలేదు. దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించగా.. కుటుంబ సభ్యులు స్థానిక కేరళ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

జీఓ 84ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ విద్యావ్యవస్థను నాశనం చేసే జీఓ నంబర్.84ను రద్దు చేసి, వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. ఫెడరేషన్ అధ్యక్షుడు పుల్లయ్యనాయక్, కార్యదర్శి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జీఓ 117 ప్రకారం అప్‌గ్రేడ్ కాబడిన ఉన్నత పాఠశాలలకు పోస్టులు మంజూరు చేసి బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. మున్సిపల్ యాజమాన్యంలో పాఠశాలలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు విద్యా శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులకు సర్దుబాటు చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

ఉయ్యాలవాడ: గ్రామాలలో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి అపర్ణ ప్రజలకు సూచించారు. నర్సిపల్లె గ్రామంలో బుధవారం ఉయ్యాలవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి, ఆరోగ్య సిబ్బంది 104 వాహనంలో తరలివెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి పిల్లల ఎత్తు, బరువు, రక్తహీనత ఉన్న చిన్నారులను గుర్తించి ఐరన్ మాత్రలను అందజేశారు. ఆకుకూరలు, బెల్లంతో తయారు చేసిన ఆహార పదార్థాలు చిన్నారులకు అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డి, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన క్రీడా పోటీలు



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీలు రెండవ రోజు బుధవారం కొనసాగాయి. ఈనెల 29న ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. అథ్లెటిక్స్ పోటీల్లో పురుషులు 30, మహిళలు 20, చెస్ పోటీల్లో 120 మంది, టేబుల్ టెన్నిస్‌లో పురుషులు 25, బాస్కెట్ బాల్‌లో పురుషులు 6 జట్లు, మహిళలు 4 జట్లు, జంప్‌రోప్‌లో పురుషులు 65, మహిళలు 36 మంది పాల్గొన్నారని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ ఫైనల్ పోటీల్లో పావని, శారదా, నాగచైతన్య, అంకన్న విజేతలుగా నిలిచారన్నారు. చెస్ పోటీల్లో ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్ పోటీల్లో శాలినిరెడ్డి, హర్షిత, రంజని, గోవర్ధన్, చరణ్, మాలిక్‌బాషా, సలీమ్, మణికుమార్ విజయం సాధించగా టేబుల్ టెన్నిస్ పోటీలు ఎల్‌కే ఆర్ స్కూల్‌లో జరిగిన ఫైనల్ పోటీల్లో రుతిక, సాయి, గౌతమ్, మహేంద్ర, ఫణీంద్ర, సంజయ్, జమీల్, గణేష్, నాగేంద్రలు విజేతలుగా గెలిచారు. జంప్ రోప్ పోటీల్లో పురుషులు, మహిళలు, ఇండోర్ స్టేడియం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్ పోటీల్లో సత్యసింహారెడ్డి, నూర్, శృతి, అక్షర, చైతన్య సాయి, రిషిక్, నాగేష్, వర్షిత, సంజనలు విజయం సాధించారని చెప్పారు. బాస్కెట్ బాల్ ఫైనల్ పోటీల్లో ఎస్‌డీఆర్ స్కూల్ విజయం సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలకు 29న బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.

వేద సదస్సుల్లో పండితుల ప్రతిభ



రవిశంకర అవధాని నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న శ్యామసుందర శర్మ

నంద్యాల(అర్బన్): కృష్ణాష్టమి సందర్భంగా రాజమహేంద్రవరం వేదశాస్త్ర పరిషత్‌లో 88వ వార్షిక వేద సదస్సులు కార్యక్రమంలో మహానంది క్షేత్ర వేదపండితులు వెంకట దుర్గానాగేశ్వరశర్మ, కుమారుడు వెంకట రామ ఫణి శ్యామసుందర్‌శర్మ ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ మేరకు బుధవారం మహానంది ఆలయ వేదపండితులు వెంకటరామ ఫణి శ్యామసుందర్‌శర్మను అభినందించారు. వేదశాస్త్రంలోని శ్రీకృష్ణ యజుర్వేదంలో మహానంది క్షేత్ర వేదపండితులు ప్రథమ స్థానంలో నిలిచి తిరుమల వేదవిద్యాపీఠం ప్రిన్సిపాల్, శృంగేరి పీఠాధిపతులు, కామకోటి, శ్రీకార్యం తదితర పీఠాధిపతుల నుంచి ధ్రువ పత్రాలు అందుకోవడం విశేషమని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తాం

నంద్యాల(న్యూటౌన్): ప్రజలపై విద్యుత్ చార్జీల పేరుతో భారం మోపుతూ స్మార్ట్ మీటర్లు తీసుకొని రావాలని తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం వ్యతిరేకిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పుల్లా నరసింహులు అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించారు. రమేష్‌కుమార్ మాట్లాడుతూ అమరుల త్యాగం వృథా కాదన్నారు. విద్యుత్ అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాల న్నారు. ప్రైవేటు కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని స్మార్ట్ మీటర్లు బిగించాలని చూస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. గౌస్, వెంకటలింగం, శివ, రమేష్, నాయక్, సాయి, సురేష్ ప్రసాద్ పాల్గొన్నారు.


గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ప్రభుత్వ అధికారుల సమన్వయంతో వ్యవహరించి గణేశుడి ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం వివేకానంద ఆడిటోరియంలో విగ్రహ నిర్వాహకుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్, పోలీసు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొని సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు. సమావేశానికి మండపాల నిర్వాహకులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు చంద్రమౌళీశ్వర రెడ్డి, నాగేంద్ర, సుధాకర్, అంబరీష్ చలంబాబు, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

బ్యాంకుల భద్రతకు చర్యలు



మాట్లాడుతున్న సీఐ వంశీధర్

శిరివెళ్ల: బ్యాంకుల భద్రత మనందరిపై ఉందని సీఐ వంశీధర్ అన్నారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో.. మండలంలోని వివిధ బ్యాంకు శాఖల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ప్రతి బ్యాంకు శాఖ వద్ద నైట్ వాచ్‌మన్ తప్పక ఉండాలన్నారు. సీసీ కెమెరాలు, అధునాతన అలారంలు, ఏటీఎం వద్ద నైట్‌మోడ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జాతీయ రహదారి వెంట ఉన్న శిరివెళ్ల, యర్రగుంట్ల బ్యాంకు శాఖల వద్ద మరింత భద్రత ఉండాలని, గతంలో ఆయా బ్యాంకుల్లో చోరీ యత్నాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రజలను అప్రమత్తం చేసేలా 'దొంగలున్నారు జాగ్రత్త' అనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి వేళలో తమ సిబ్బంది బ్యాంక్ శాఖలు, ఏటీఎంల వద్ద ప్రత్యేక గస్తీ నిర్వహిస్తామని చెప్పారు. చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తేవాలన్నారు. ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.